

చిక్కడపల్లి పీఎస్ వద్ద నిరసన తెలుపుతున్న జాతీయ మాలల ఐక్యవేదిక నేతలు

మాదిగలకు వత్తాసు పలుకుతున్న సీఎం

● జాతీయ మాలల ఐక్యవేదిక నిరసన

చిక్కడపల్లి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాదిగలకు వత్తాసు పలుకుతూ మాట్లాడడం ఎంత మాత్రం సబబు కాదని జాతీయ మాలల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు కరణం కిషన్ ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడికి ప్రయత్నించిన జాతీయ మాలల ఐక్య వేదిక నేతలు కిషన్, ప్రధానకార్యదర్శి మన్నె రంగ, ఆవుల సుధీర్, గుడ్డిమల్ల వినోద్, పంబాల రాజు, గడ్డం వినయ్, నల్లపవన్, కరణం నాగేశ్వరరావు తదితరులను అరెస్ట్‌చేసి చిక్కడపల్లి పీఎస్‌లో ఉంచారు. ఈ సందర్భంగా పీఎస్ వద్ద నిరసన తెలిపి విలేకరులతో మాట్లాడారు. మాదిగలకు వత్తాసు పలుకుతూ పదిరోజుల్లో వర్గీకరణ చేస్తానని చెప్పడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. ఇదేవిధంగా సీఎం వ్యవహారం ఉంటే రాబోయేరోజుల్లో పెద్దఎత్తున ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గౌతమ్‌రావు

గ్రేటర్‌లో బీజేపీని పటిష్టం చేయాలి

● మాజీ ఎమ్మెల్యే లక్ష్మీనారాయణ

బర్కత్‌పుర, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌లో బీజేపీని బూత్ స్థాయి నుంచి పటిష్టం చేయాలని మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర ఎన్నికల రిటర్నింగ్ అధికారి యెండల లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. గురువారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు అధ్యక్షతన జిల్లా వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పార్టీ ఇచ్చిన గడువులోపే బూత్ కమిటీలను పూర్తి చేయాలని కోరారు. కిందిస్థాయిలో బీజేపీ బలంగా ఉన్నప్పుడే రాబోయే జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో సత్తా చాటగలమన్నారు. డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు మాట్లాడుతూ సెంట్రల్ జిల్లాలోని ప్రతి బూత్‌లో పార్టీ బలమైన శక్తిగా అవతరించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.మనోహర్‌రెడ్డి, జిల్లా రిటర్నింగ్ అధికారి జె.శ్రీకాంత్, అట్లూరి రామకృష్ణ, లాయక్ ఆలీ పాల్గొన్నారు.



సిండికేట్ బ్యాంక్ ఎంప్లాయీస్ కో-ఆపరేటివ్ సొసైటీ సభ్యులు

సిండికేట్ బ్యాంక్ ఎంప్లాయీస్ కో-ఆపరేటివ్ సొసైటీ కార్యవర్గం ఎన్నిక

బర్కత్‌పుర, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సిండికేట్ బ్యాంక్ తెలంగాణ మల్టీ పర్పస్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీ ఎన్నికల్లో రాష్ట్ర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం కాచిగూడలో జరిగిన కార్యక్రమంలో అధ్యక్షుడిగా సయ్యద్ ఇక్బాల్, కార్యదర్శిగా పరమేశ్వర్, ఉపాధ్యక్షుడిగా వెంకటి, కోశాధికారిగా వినోద్, కార్యవర్గ సభ్యులుగా హనుమంతరావు, శ్రీనివాస్, శ్రీకాంత్, లక్ష్మయ్యలు ఎన్నికయ్యారు. ప్రతినిధులు వెంకటరమణ, వసంత సేనరాజు, శ్రీనివాస్ నాయక్, అబ్దుల్ హాయ్, వెంకటేశ్వర్‌రావు, అనంద్‌కుమార్, నవీన్‌కుమార్, రాజ్‌కుమార్, మహేష్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ప్రత్యేక హాస్టళ్లు ఏర్పాటు చేయాలి

● సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ప్రసాద్



కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించిన ప్రసాద్, తదితరులు

రాంనగర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇంటర్, డిగ్రీ కాలేజీ కోర్సులు చదివే దివ్యాంగులకు ప్రత్యేక హాస్టళ్లు ఏర్పాటు చేయాలని దివ్యాంగుల సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు వల్లభనేని ప్రసాద్, ప్రతినిధులు కాటమూరి వెంకటేష్‌గౌడ్ గురువారం దివ్యాంగుల సంక్షేమ శాఖ కమిషనర్‌ను సంక్షేమ భవనంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు ప్రత్యేక కాలేజీ హాస్టళ్లు లేకపోవడం వల్ల ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. మలక్‌పేటలోని దివ్యాంగుల సంక్షేమ భవనం ఆవరణలో కాలేజీ హాస్టళ్లు ఏర్పాటు చేయాలని కమిషనర్‌ను కోరామన్నారు. దివ్యాంగుల సంక్షేమ శాఖకు డైరెక్టర్‌ను నియమించాలని కోరినట్లు తెలిపారు. తమ డిమాండ్లకు కమిషనర్ సానుకూలంగా ఉన్నట్లు ఆయన తెలిపారు.

మానవ హక్కుల, క్రైమ్ కంట్రోల్ కౌన్సిల్ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా మోహీద్‌ఖాన్

రాంనగర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మానవ హక్కుల, క్రైమ్ కంట్రోల్ కౌన్సిల్ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా విద్యానగర్‌కు చెందిన ప్రముఖ సంఘసేవకుడు ఎం.ఎ.మోహీద్‌ఖాన్ నియమితులయ్యారు. ఆయన నియామకాన్ని మానవ హక్కుల, క్రైమ్ కంట్రోల్ కౌన్సిల్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వీపీ సింగ్ ప్రకటించారు. గురువారం విద్యానగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా తాను చేస్తున్న సామాజిక సేవ, పౌర హక్కుల హక్కుల పరిరక్షణ కోసం కార్యక్రమాలను గుర్తించి ఈ పదవి కల్పించడం సంతోషంగా ఉందన్నారు. మానవ హక్కుల పరిరక్షణకు వైస్ చైర్మన్‌గా తనవంతు కృషి చేస్తానన్నారు. పౌరుల హక్కులకు ఎవరు భంగం కలిగించిన తమ సంస్థ పక్షాన వారికి అండగా నిలిచి పోరాటం చేస్తానన్నారు.

ఆకట్టుకున్న గానవిభావరి

చిక్కడపల్లి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): డీజే మ్యూజిక్ లవర్స్ సింగింగ్ క్లబ్ ఆధ్వర్యంలో త్యాగరాయగానసభలో గురువారం రాత్రి నిర్వహించిన గానవిభావరి ఆకట్టుకుంది. నిర్వాహకులు, గాయకుడు దొంతి జంగయ్యగౌడ్‌తోపాటు సహ గాయనీగాయకులు నందగోపాల్, జయంతికుమార్, సుబ్బిరెడ్డి, కృష్ణమూర్తి, అయోధ్యరామయ్య, రామమూర్తి, విద్యాసాగర్, భువన, రాధ, కామేశ్వరి, ఉషామల్లాదిలు తెలుగు, హిందీ సినీగీతాలు మధురంగా ఆలపించారు. రంగస్థల నటులు దామోదరం నాగేంద్ర ముఖ్యఅతిథిగా విచ్చేసి గాయనీగాయకులను అభినందించారు.

నరసింహగౌడ్ గుండె పోటుతో మృతి

కవాడిగూడ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): శ్రీసాయిరాం హైస్కూల్ వ్యవస్థాపకులు కపాల నరసింహగౌడ్(73) గుండె పోటుతో గురువారం మృతి చెందారు. ఆయనకు భార్య ప్రమీల, కుమార్తె సౌమ్య, కుమారులు సాయి, కల్యాణ్‌లు ఉన్నారు. ఆయన మృతి చెందిన విషయాన్ని తెలుసుకుని బీజేపీ రాష్ట్ర నాయకులు జి.వెంకటేష్, రంగరాజుగౌడ్, పి.ఎస్.చారి, కవాడిగూడ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ఎం.సి.మహేందర్‌బాబు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు బంటారం యాదగిరిగౌడ్ నరసింహగౌడ్ భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

అమిత్‌షా పార్లమెంట్ సభ్యత్వం రద్దు చేయాలి

● ఆయనపై ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టాలి
● కేవీపీఎస్ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ కమిటీ నేతలు

నల్లకుంట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చేసిన అవమానకరమైన వ్యాఖ్యలపై ఆయన పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని, ఆయనపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని కేవీపీఎస్ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ కమిటీ కార్యదర్శి బి.సుబ్బారావు, ఉపాధ్యక్షుడు మహేందర్‌లు డిమాండ్ చేశారు. గురువారం కేవీపీఎస్ అంబర్‌పేట జోన్ కమిటీ ఆధ్వర్యంలో నల్లకుంట డివిజన్ తిలక్‌నగర్ చౌరస్తాలో అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ కేంద్ర హోం మంత్రి అమిత్‌షా రాజీనామా చేయడంతోపాటు దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు జి.రాములు, అర్జున్, జనార్ధన్, మహదేవ్, కిషన్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వీహెచ్ దీక్షకు కాంగ్రెస్ నేతలు

బర్కత్‌పుర, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ మాజీ ఎంపీ వి.హనుమంతరావు గురువారం లోయర్ ట్యాంక్‌బండ్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన సత్యాగ్రహ దీక్షకు అంబర్‌పేట నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు భారీగా తరలివెళ్లారు. ఈ దీక్షలో జీహెచ్‌ఎంసీ మాజీ ఫ్లోర్‌లీడర్ దిడ్డి రాంబాబు, మాజీ కార్పొరేటర్ పులి జగన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణ్‌యాదవ్, కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్, ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణగౌడ్, మహిళా విభాగం అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీగౌడ్ నాయకులు రామ్మోహన్, కె.మురళీకృష్ణ, మెట్టు సాయి పాల్గొన్నారు.



నల్లకుంట తిలక్‌నగర్ చౌరస్తాలో అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కేవీపీఎస్ నేతలు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో హర్షవర్ధన్‌రెడ్డికే మద్దతు

● 36 ఉపాధ్యాయ సంఘాల టీచర్స్ జేఏసీ కమిటీ చైర్మన్ మహిపాల్‌రెడ్డి

రాంనగర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో హర్షవర్ధన్‌రెడ్డికి తమ మద్దతు ప్రకటిస్తున్నట్లు 36 ఉపాధ్యాయ సంఘాల టీచర్స్ జేఏసీ కమిటీ చైర్మన్ మహిపాల్‌రెడ్డి, కార్యదర్శి సత్యనారాయణలు అన్నారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో హర్షవర్ధన్‌రెడ్డికి మద్దతుగా 36 ఉపాధ్యాయ సంఘాల టీచర్స్ జేఏసీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీచర్స్ సంఘాల జేఏసీ బలపరిచిన హర్షవర్ధన్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటామన్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై ఆయనకు ప్రత్యేకమైన అవగాహన ఉందని, వాటి పరిష్కారానికి ఆయన ఎంతో కాలంగా పోరాటం చేస్తున్నారని అన్నారు. ఆయన ఎమ్మెల్సీగా గెలిస్తే తమ సమస్యలు పరిష్కారమవుతామని భావిస్తున్నామని అన్నారు.

ఆయన కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా పనిచేయడం సీఎం రేవంత్‌రెడ్డి ఆశీస్సులు ఉన్నందున ఆయన ఎమ్మెల్సీగా గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి టీచర్‌పై ఉందన్నారు. కార్యక్రమంలో జేఏసీ కో-చైర్మన్‌లు గోవింద్ నాయక్, లచ్చిరామ్, నర్సింహులు, సత్యనారాయణ, రఘునందన్‌రెడ్డి, వైస్ చైర్మన్‌లు లింగస్వామి, బల్వంత్‌రెడ్డి, ఉమాకర్ రెడ్డి, అంజన్న, యాదగిరి, ఆదర్శరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జేఏసీ సమావేశంలో మాట్లాడుతున్న 36 ఉపాధ్యాయ సంఘాల టీచర్స్ జేఏసీ కమిటీ చైర్మన్ మహిపాల్‌రెడ్డి

18 ఏళ్లలోపు పిల్లలు అప్రమత్తంగా ఉండాలి

ముషీరాబాద్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): 18 ఏళ్ల లోపు పిల్లలంతా అప్రమత్తంగా ఉండాలని నోడల్ ఆఫీసర్ కల్యాణి రెడ్డి అన్నారు. గురువారం ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో షీటీమ్స్, భరోసా సర్వీసెస్ సంయుక్త ఆధ్వర్యంలో పిల్లల భద్రత, లైంగిక వేధింపులు తదితర అంశాలపై విద్యార్థుల్లో అవగాహన కల్పించి ఎవరికి ఫిర్యాదు చేయాలి అనే అంశాలను వివరించారు. ఈ సందర్భంగా కల్యాణిరెడ్డి మాట్లాడుతూ బాలికలపై వేధింపుల విషయంలో పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

టీనేజీ అమ్మాయిలు, అబ్బాయిలు శారీరక మార్పుల వల్ల ఆకర్షణకు లోనయ్యే అవకాశం ఉందని దీనివల్ల ఇబ్బందులకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే పెద్దలకు సూచించాలన్నారు. కార్యక్రమంలో ముషీరాబాద్ విద్యామండలి డిప్యూటీ ఐవోఎస్ స్వరూపారాణి, భరోసా, షీటీమ్స్ ప్రతినిధులు కనీజ్ ఫతీమా, ఉపాధ్యాయుడు నరేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నోడల్ ఆఫీసర్ కల్యాణి రెడ్డి

'జీవో 317 స్థానికత అంశాన్ని పరిష్కరించాలి'

చిక్కడపల్లి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పరిధిలోనే 317 జీవో స్థానికత అంశాన్ని పరిష్కరించాలని జీవో 317 జేఏసీ నేతలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. చిక్కడపల్లిలోని ఓ హోటల్‌లో గురువారం సాయంత్రం జరిగిన సమావేశంలో జేఏసీ నాయకులు విజయ్‌కుమార్ మాట్లాడుతూ శాసనమండలిలో జీవో 317 స్థానికత అంశాన్ని చర్చించిన ఎమ్మెల్సీలకు ధన్యవాదాలు తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయ లోకంలో సునామి సృష్టించి దాదాపు 32 మంది మరణానికి కారణమైన చీకటి జీవో 317 పైన గురువారం చర్చకు రావడం శుభపరిణామమన్నారు. శాసనమండలిలో జీవో 317 అంశాన్ని లేవనెత్తి తమ అమూల్యమైన సలహాలు, సూచనలు ఇచ్చిన ఎమ్మెల్సీలు ఏవీఎన్ రెడ్డి, తీన్మార్ మల్లన్న, ప్రొ. కోదండరామ్, జీవన్‌రెడ్డిలకు జీవో 317 ఉద్యోగ ఉపాధ్యాయుల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్సీలు సూచించిన విధంగానే రాష్ట్ర పరిధిలోనే జీవో 317లోని పేరా 28, ప్రొటెక్షన్ క్లాజ్ ప్రకారం గ్రీవియన్స్‌లో అప్లయ్ చేసుకున్నవారికి స్థానికత ఆధారంగా రీ అలకేట్ చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. టీపీసీసీ అధ్యక్ష హోదాలో ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టిన ప్రకారం జీవో 317 బాధితులకు న్యాయం చేసి తమ మాటను నిలబెట్టుకోవాలని కోరారు. మూడు సంవత్సరాల నుంచి ఉద్యోగ ఉపాధ్యాయులు ముఖ్యంగా మహిళలు పడుతున్న మానసిక వేదన కష్టాలను దూరం చేసి నూతన సంవత్సర కానుకగా స్థానికత కల్పించాలని కోరారు. సమావేశంలో జేఏసీ నేతలు నాగేశ్వరరావు, సందీప్, మదుసూదన్, ,చాముండేశ్వరి, వినోద, హారతి పాల్గొన్నారు.

దేశాభివృద్ధికి ఆర్థిక వ్యవస్థ ప్రధానం

● గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ

రెజిమెంటల్‌బజార్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): భారత దేశాభివృద్ధిలో ఆర్థిక వ్యవస్థ ఒక భాగం మాత్రమే కాదని.. ప్రధానమని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. గురువారం సికింద్రాబాద్ సెయింట్ మేరీస్ సెంటినరీ కాలేజ్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో రెండు రోజుల జాతీయ స్థాయి మేనేజ్‌మెంట్ ఫెస్ట్ ఎంప్రెసాను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. దేశంలో భిన్న మతాలు, ప్రాంతాలు, భాషలు ఉన్నప్పటికీ మనమంతా భారత దేశ పౌరులమని అన్నారు. పురోగతి సాధించడం అంటే బ్యాంకు బాలెన్స్ కాదని, మానసిక పురోగతి సాధించాలని అన్నారు. అన్ని జీవులకు శిక్షణ ఇస్తే సరిపోతుందని కానీ, మానవులకు శిక్షణతో పాటు చదువు కూడా అందించాలన్నారు. చదువు అనేది కేవలం పుస్తకం నుంచి మాత్రమే కాకుండా సమాజం నుంచి నేర్చుకోవాలన్నారు. సమగ్ర విద్య అనేది కంప్యూటర్, బుక్స్ నుంచి రాదని విద్యా సంస్థలు అందించాలని అన్నారు. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి చెప్పినట్లు మానవులు అంతరిక్షంలోకి పోతున్నారు కానీ ఎలా జీవించాలో నేర్చుకోవాలని అన్నారు. చదువుకున్న వ్యక్తి ఎక్కడైనా గౌరవించబడతాడని అన్నారు. హైదరాబాద్ ఆర్చ్ బిషప్ అండ్ హైదరాబాద్ ఆర్చ్ డయోసిస్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ పూల ఆంథోనీ మాట్లాడుతూ.. తమ విద్య సంస్థల్లో పేద విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్, ఉచిత విద్య, ఫీజులో రాయితీ ఇచ్చి ప్రోత్సహిస్తున్నా మన్నారు.

కార్యక్రమంలో హెచ్ఏఈఎస్ వైస్ చైర్మన్ ఎరువా బాలశౌరి, డైరెక్టర్ అండ్ ప్రిన్సిపాల్ ఆంథోనీ వినయ్, ఓయూ మేనేజ్ మెంట్ కాలేజ్ డీన్ ప్రొఫెసర్ శ్రీరాములు, ప్రొఫెసర్ చేతన్ శ్రీవాస్తవ, విద్యాసాగర్, మిస్సీ మాథ్యూ, మాథ్యూసి కున్నుమ్మకల్ తదితరులు పాల్గొన్నారు.



వేదికపై గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, కార్డినల్ పూల ఆంథోని తదితరులు



సమావేశంలో మాట్లాడుతున్న అరవింద్‌కుమార్‌యాదవ్

రాహుల్‌గాంధీపై పెట్టిన కేసును ఎత్తివేయాలి

● యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి అరవింద్‌కుమార్‌యాదవ్

రాంనగర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాహుల్‌గాంధీపై పెట్టిన కేసును ఎత్తివేయకపోతే బీజేపీ నేతలను రోడ్లపై తిరగనివ్వమని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి అరవింద్‌కుమార్‌యాదవ్ హెచ్చరించారు. గురువారం ముషీరాబాద్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్లమెంట్‌లో జరిగిన ఎంపీల తోపులాటలో బీజేపీ ఎంపీకి స్వల్ప గాయమైతే అది రాహుల్‌గాంధీపై కేసు నమోదు చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఒకవైపు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించడమే కాకుండా మరో వైపు కాంగ్రెస్ నేతలపై కేసులు నమోదు చేయడం బీజేపీ నిజస్వరూపం ప్రస్ఫుటమైందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సురేష్, సత్యనారాయణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు దుప్పట్లను పంపిణీ చేస్తున్న బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి బండారు విజయలక్ష్మి, కార్పొరేటర్లు కె.రవిచారి

పేద మహిళలకు దుప్పట్ల పంపిణీ

రాంనగర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వైష్ణవ్ బండారు ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేద మహిళలకు దుప్పట్ల పంపిణీ కార్యక్రమం గురువారం అడిక్‌మెట్ డివిజన్‌లోని టీఆర్‌టీ కాలనీలో జరిగింది. ఈ కార్యక్రమానికి ఫౌండేషన్ చైర్మన్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి బండారు విజయలక్ష్మి, కార్పొరేటర్లు కె.రవిచారి, సుప్రీయానవీన్‌గౌడ్, అడిక్‌మెట్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ఆర్.నరేష్‌లు హాజరై దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ హరియాణా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ తనయుడు బండారు వైష్ణవ్ చిన్న వయసులో చనిపోవడంతో ఆయన పేరిట ఫౌండేషన్ ఏర్పాటు చేసి తరచు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం చలికాలంలో నిరుపేద మహిళలకు తమ ఫౌండేషన్ తరపున దుప్పట్లను పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నవీన్‌గౌడ్, ఓమ్, నందు, రోయ్యూరు శేషసాయి తదితరులు పాల్గొన్నారు.



పూడిక మట్టిని తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

నాలా పూడిక మట్టి తొలగింపు

రాంనగర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాంనగర్ నాలలో తీసిన పూడిక మట్టిని గురువారం జీహెచ్‌ఎంసీ అధికారులు తొలగించారు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో గురువారం ప్రచురితమైన 'నెలరోజులుగా తొలగించని మట్టికుప్పలు, వెలువడుతున్న తీవ్ర దుర్వాసన' అనే కథనానికి జీహెచ్‌ఎంసీ ఏఈ విశ్వేష్ నాయక్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్‌లు స్పందించి ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేసి మట్టిని తొలగించారు. మట్టికుప్పల సమస్యను జీహెచ్‌ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేసిన ఆంధ్రజ్యోతికి స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు.



ప్రసాద్‌ను సన్మానిస్తున్న అతిథులు, నిర్వాహకులు

మానసికోల్లాసానికి దోహదపడే సంగీతం

చిక్కడపల్లి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మానసిక ఉల్లాసానికి సంగీతం దోహదపడుతుందని ప్రముఖ సినీనటుడు, నిర్మాత రాంకీ అన్నారు. రిషి మ్యూజికల్ ఈవెంట్స్ తృతీయ వార్షికోత్సవం త్యాగరాయగానసభ ప్రధానహాలులో గురువారం రాత్రి జరిగింది. ముఖ్యఅతిథిగా కార్యక్రమంలో పాల్గొన్న రాంకీ మాట్లాడుతూ ఈ సంస్థ అధ్యక్షురాలు యోగిత అక్కిరాజు మూడు సంవత్సరాల్లో తమ సంస్థ ద్వారా అనేకమంది గాయనీగాయకులను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ గాయకులు రామకృష్ణ, కొమ్మురాజు ప్రసాద్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా 2025 సంవత్సరంలో రిషి మ్యూజికల్ సంస్థ నిర్వహించే ప్రోగ్రామ్ క్యాలెండర్‌ను అతిథుల చేతులమీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో వంశీ రామరాజు, గుదూరు శ్రీనివాస్ (అమెరికా), కొమాండూరి రామాచారి, త్రినాథరావు, మల్లెల వసుందర, దైవజ్ఞశర్మ, ఇందునయన, కీర్తి, యోగితా అక్కిరాజు తదితరులు పాల్గొన్నారు.



ధర్నాలో మాట్లాడుతున్న గొర్రెలు మేకల పెంపకం దార్ల తెలంగాణ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు కిల్లె గోపాల్, ఉడుత రవీందర్

గొల్లకురుమలను మోసం చేసిన కాంగ్రెస్

● తెలంగాణ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు గోపాల్

కవాడిగూడ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే గొర్రెలు, మేకల పెంపకం దార్లకు రెండు లక్షల నగదు బదిలీ ద్వారా రెండో విడత గొర్రెల పంపిణీ చేస్తామని హామీ ఇచ్చి గొల్లకురుమలను మోసం చేశారని గొర్రెలు , మేకల పెంపకం దార్ల సంఘం తెలంగాణ రాష్ట్ర కమిటీ అధ్యక్షులు కిల్లె గోపాల్, ప్రధాన కార్యదర్శి ఉడుత రవిందర్ ఆరోపించారు. ఎన్నికల్లో గొల్ల కురుమలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం ఇందిరాపార్కు వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం గొల్ల కురుమలను మోసం చేసినట్లే నేటి కాంగ్రెస్ ప్రభుత్వం కూడా వ్యవహరిస్తుందని ఆరోపించారు. అధికారంలోకి వచ్చి సంవత్సరం గడుస్తున్నా హామీని అమలు చేయకుండా పాత ప్రభుత్వ అడుగుజాడల్లోనే నడుస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుంటే రాబోయే రోజుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ ధర్నాలో నాయకులు రమణ, లింగయ్య, మల్లేశం, అశోక్, మదుకర్, సురేష్, రవి యాదగిరితోపాటు నాయకులు కార్యకర్తలు వృత్తిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు ఘంటసాల జయంతి వేడుకలు

చిక్కడపల్లి, డిసెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): రాగరాగిణి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం అమరగాయకుడు ఘంటసాల జయంతి వేడుకలు త్యాగరాయగానసభలో నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణకుమారి, సుబ్బలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా గాయనీగాయకులతచే ఘంటసాల గానవిభావరి ఉంటుందని ఈ సందర్భంగా ప్రముఖ గాయకుడు ప్రభాకరరావుకు ఘంటసాల పురస్కారం బహూకరిస్తామని వారు వివరించారు. ఘంటసాల అభిమానులు పెద్దఎత్తున హాజరు కావాలని కోరారు.

గాంధీభవన్‌లో మినీ క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్‌నేతలు

చిక్కడపల్లి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గాంధీభవన్‌లో టీపీసీసీ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి జరిగిన మినీ క్రిస్మస్ వేడుకలు విజయవంతం అయ్యాయని ఆలిండియా మహిళా కాంగ్రెస్ జాతీయ పరిశీలకురాలు డా. ఎస్తేర్‌రాణి తెలిపారు. గురువారం సాయంత్రం ఆమె చిక్కడపల్లిలో మాట్లాడారు. అనివార్ల కారణాలవల్ల సీఎం రాలేకపోయారని, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌తోపాటు పలువురు ప్రముఖులు, కాంగ్రెస్ నేతలు, క్రైస్తవ సోదరులు పాల్గొన్నారని వివరించారు.